ప్రజాశక్తి
శనివారం 3 మే 2025
5
శ్రీ సత్యసాయి





జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద జనం (ఫైల్ ఫోటో)



అహుడా అడగదా..?

చిలమత్తూరు మండలం అహుడా పరిధిలో అక్రమ లేఅవుట్ల వ్యవహారం తారా స్థాయికి చేరింది. ఏ మాత్రం అనుమతులు లేకుండానే లేఅవుట్‌లు వేసి రియల్టర్లు విక్రయాలు చేస్తున్నారు. నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా అమాయక ప్రజలను మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లేఅవుట్లు వేసే వారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇక అహుడా కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో అక్రమ లేఅవుట్లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

- ◆ చిలమత్తూరులో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్‌లు
- ◆ అనుమతులుండవు.. నిబంధనలు పాటించరు..!
- ◆ కన్వర్షన్‌ల ఊసేలేదు..

ప్రజాశక్తి-చిలమత్తూరు

నిబంధనల ప్రకారం లే అవుట్ వేయాలంటే పంచాయతీ అధికారి అనుమతి పొందాలి. అనంతరం అహుడా అనుమతులు ఇవ్వాలి. లేఅవుట్ అభివృద్ధి ఎలా చేస్తారు.. ఎంత శాతం భూమిని మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు.. తదితర వివరాలను అహుడాకు సమర్పించాల్సి ఉంది. వ్యవసాయ భూమిలో లేఅవుట్ వేస్తే దానిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయాల్సి ఉంటుంది. కమర్షియల్ భూమిగా మార్చిన తర్వాతే లే అవుట్ వేయాలి. చిలమత్తూరు మండలం కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలో వేస్తున్న లేఅవుట్‌లో మచ్చుకైనా ఇవి కన్పించుకున్నా వెంచర్లు మాత్రం పుట్టుకొస్తున్నాయి.

భూమి చదును అంటూ అనుమతులు

కమర్షియల్‌గా మట్టిని వాడుకోవాలంటే మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారుల అనుమతి తీసుకోవాలి. వారి అనుమతి అనంతరం తవ్వుతున్న భూమి కొలతలను బట్టి ప్రభుత్వానికి సుంకం చెల్లించాల్సి ఉంటుంది. కోడూరు పరిధిలో వేస్తున్న లేవుట్‌లలో ఇలాంటి నిబంధనలు ఏమి పాటించడం లేదు. భూమి చదును పేరుతో వ్యవసాయ భూమిలో వందల ట్రాక్టర్ల మట్టిని చెరువులు, లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల నుంచి తీసుకొచ్చేస్తున్నారు. ఈ మట్టితో లేఅవుట్‌లను చదును చేసుకుంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయానికి గండి కొడుతున్నారు. కళ్లెదుటే నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎవరైనా దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్తే వన్-బిలో వ్యవసాయ భూమిగా ఉందని, వ్యవసాయ అవసరాల నిమిత్తం పొలాన్ని చదును చేసుకుంటున్నారమోనని తాము అనుకున్నామని అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అహుడా అనుమతులు నిల్

చిలమత్తూరు మండలం అహుడా పరిధిలోకి వస్తుంది. అహుడా పరిధిలో ఉన్నా అందుకు సంబంధించిన నిబంధనలేవీ లేఅవుట్‌ల విషయంలో అమలు కావడం లేదు. పెద్దపెద్ద ప్రొక్లైనర్లతో భూములను చదును చేస్తున్నారు. ప్రయివేటు సర్వేయర్‌లతో ప్లాట్లు వేయిస్తున్నారు. ప్రభుత్వ భూముల నుంచి తీసుకొచ్చిన మట్టితో లేఅవుట్లలో రోడ్లు వేస్తారు. హద్దు రాళ్లకు రంగురంగుల కలర్లు వేస్తారు. పెద్దపెద్ద చెట్లు నాటి త్రీడీలో స్కెచ్‌లు వేస్తారు. బెంగుళూరు ఎయిర్ పోర్ట్, లేపాక్షి నంది, వీరాపురం బర్డ్స్ కేంద్రం, ప్రశాంతి నిలయం, బెంగుళూరు హైవే అంటూ ప్రకటన పత్రాలు తయారు చేస్తారు. అందమైన డిజైన్లతో వెంచర్‌ను ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తారు. ఇదంతా అహుడా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా ఆ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

కోడూరు పంచాయతీలో అధికం

కోడూరు పంచాయతీ కోడూరు రెవెన్యూ పొలం అధికంగా బెంగుళూరు జాతీయ రహదారికి అనుకుని ఉంది. ఆ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్‌లకు మంచి గిరాకి ఉండడంతో అక్రమ లేఅవుట్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ పద్ధతుల్లో లేవుట్‌లు వేసి రియల్టర్లు జేబులు నింపుకుంటున్నారు. నిబంధనలను తుగ్గలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ విచ్చలవిడిగా వేస్తున్న అక్రమ లేఅవుట్లపై సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు గాలికి..!

మొరంపల్లిలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. కనిశెట్టిపల్లి సమీపంలో సర్వే నంబర్ 417, మొరంపల్లిలో 751- 2ఎ6, 751-2ఎ7, సర్వేనంబర్‌లో ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ అధికారులను ప్రజాశక్తి వివరణ కోరగా లేవుట్‌ల నిర్మాణానికి తాము అనుమతి ఇవ్వలేదని వారు చెబుతున్నారు. అహుడా అనుమతి కూడా లేదు. అయినా యథేచ్ఛగా లేఅవుట్‌లు ప్లాట్లుగా వేసి విక్రయించే ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. కోడూరు పంచాయతీ కోడూరు రెవెన్యూ పొలం అధికంగా బెంగుళూరు జాతీయ రహదారికి అనుకుని ఉంది. ఆ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్‌లకు మంచి గిరాకి ఉండడంతో అక్రమ లేఅవుట్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ పద్ధతుల్లో లేవుట్‌లు వేసి రియల్టర్లు జేబులు నింపుకుంటున్నారు. నిబంధనలను తుగ్గలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ విచ్చలవిడిగా వేస్తున్న అక్రమ లేఅవుట్లపై సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణకురాని పైలెట్ ..!

ముందుకు సాగని హెలికాప్టర్ కేసు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా వైఫల్యంపై పోలీసు అధికారుల విచారణ కొనసాగుతోంది. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామ పర్యటనకు గత నెలలో జగన్మోహన్ రెడ్డి విచ్చేశారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఇక్కడికి విచ్చేసిన సమయంలో పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు నాయకులు ఆయన దిగిన హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింది. ఆయనను తిరుగు ప్రయాణంలో తీసుకెళ్లలేమని హెలికాప్టర్ సిబ్బంది తిరస్కరించారు. జగన్మోహన్ రెడ్డిని వెంట తీసుకెళ్లకుండానే హెలికాప్టర్ తిరిగి వెళ్లింది. దీంతో ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరు వెళ్లారు. భద్రత వైఫల్యంతోనే హెలికాప్టర్ నష్టం జరిగిందని వైసిపి నాయకులు ఆరోపించారు. ఈ ఆరోపణ నేపథ్యంలో పోలీసులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టారు. జగన్‌మోహన్ రెడ్డి పర్యటన రోజు హెలికాప్టర్‌కు ఎటువంటి ప్రమాదం జరిగిందన్న దానిపై ఆరా తీసే పని చేపట్టారు. గత నెల 16వ తేదీన విచారణ హాజరు కావాలని పైలట్, కో పైలట్లకు నోటీసులు ఇచ్చారు. విచారణకు 16వ తేదీన కోపైలట్ ఆయన న్యాయవాదితో కలిసి చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హాజరై తమ వాదనలను వినిపించారు. మాండేటరీ లీవ్‌లో ఉన్నందున అనిల్ కుమార్ రాలేకపోయినట్టు ఆ రోజు పోలీస్ అధికారులకు తెలిపారు. మరో తేదీన హాజరుకావాలని పైలెట్ అనిల్ కుమార్‌కు సత్యసాయి జిల్లా పోలీసులు నోటీసు ఇచ్చారు. మే ఒకటి, రెండు తేదీల్లో హాజరై హెలికాప్టర్ సంబంధించిన ఇబ్బందులపై వివరణ ఇవాల్సి ఉంది. అయితే అనిల్ కుమార్ ఒకటి, రెండు తేదీల్లో కూడా విచారణకు హాజరవలేదు. ఆయన హాజరుకాని నేపథ్యంలో తదుపరి చర్యలకు పోలీసులు సమాయత్తమవుతున్నట్టు సమాచారం. పైలెట్ అనిల్ కుమార్ వివరణతోనే జగన్మోహన్ రెడ్డి పర్యటనలో ఏం జరిగిందన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశాలు న్నాయి. కో పైలెట్ ఇచ్చిన వివరణలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిన్న టేక్ ఆఫ్ చెయ్యొచ్చు అన్న నిర్ణయం తీసుకోగలిగేది పైలెట్ చేతిలోనే ఉంటుందని చెప్పినట్టు సమాచారం. పైలెట్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని హెలికాప్టర్లో తీసుకెళ్లడానికి నిరాకరించి తర్వాత ఏ రకంగా టేక్ ఆఫ్ చేసుకుని వెళ్లారన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికీ పోలీసులు అటు హెలికాప్టర్ సంస్థకు దానిని బుక్ చేసిన ట్రావెల్ ఏజెన్సీకి నోటీసులు ఇచ్చారు. వీరందరి వివరణ తర్వాత ఆరోజు పర్యటనలో ఎవరి లోపాలున్నాయని తేలనుంది.

వైసిపిని వెంటాడుతున్న కేసులు

వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద జరిగిన విషయంలో నిర్వాహకులైన రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు అయ్యింది. గత నెల పదవ తేదీన ఆయనపై కేసు నమోదు చేశారు. ఒకవైపు హెలికాప్టర్ సిబ్బందిపై విచారణ చేపడుతూనే మరోవైపు ఈ కార్యక్రమం నిర్వాహకులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ విషయంలో ముందస్తు బెయిల్ కోసం ప్రకాష్ రెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బెయిల్ లభించకపోవడంతో ఆయన అజ్ఞాతంలో వెళ్లారు. ఇదే సమయంలో ప్రకాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

రైల్వే, జల శక్తి శాఖల సహాయ మంత్రి వి.సోమన్నను శుక్రవారం బెంగళూరులో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ డి.శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎండి రాజు, ఎర్ర శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిన రైల్వే పనులను పూర్తి చేయా లని, సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఆగిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని వారు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపినట్లు వారు తెలిపారు.



కేంద్ర సహాయ మంత్రి సోమన్నను కలిసిన మడకశిర టిడిపి నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని బూచెర్ల గ్రామంలో శుక్రవారం టిడిపి కార్యకర్త పెద్ద అంజనప్ప(63) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల సీనియర్ నాయకుడు మాధవనాయుడు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బ రత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మాజీ జడ్పిటిసి చిన్న పుయ్య, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి మంజునాథ్ వారి ఇంటి వద్దకు వెళ్లి పెద్దఅంజనప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీ సీనియర్ కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, డీలర్ చంద్రమౌళి, రామకృష్ణ, కదిరప్ప, నరసింహులు, మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాలు పాల్గొన్నారు.



అంజనప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ముస్లిం, క్రిస్టియన్,భూధిస్ట్ ,సిక్, జైన్, పార్శి వార్శి మతస్తులలో అర్హులు మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు మే 10వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

శ్మశానవాటికలో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కంబాలపల్లి గ్రామ శ్మశానవాటికలో సర్పంచి కె.మంజు జెసిబి పెట్టించి ముళ్లపొదలు తొలగించారు. కంబాలపల్లి గ్రామ శ్మశానవాటికలో ఎన్నో ఏళ్ల నుంచి ముళ్ల పొదలు ఏపుగా దట్టంగా పెరిగాయి. దీంతో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే మృతదేహాలను పూడ్చడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల ఈ విషయాన్ని సర్పంచి మంజు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆమె వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం సర్పంచి మంజు జెసిబి పెట్టించి ముళ్లపొదలను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే శ్మశానవాటికకు వెళ్లుందుకు సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణం, తదితర అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 1.3 కోట్లు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



శ్మశానవాటికలో ముళ్లపొదలు తొలగిస్తున్న జెసిబి

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-మడకశిర

నూతన విద్యాహక్కు చట్టం మేరకు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఇఒలు శ్రీనివాసభాస్కర్, నరసింహామూర్తి తెలిపారు. మండలం లోని సెయింట్ ఆన్స్, సిద్దార్థ, శ్రద్ధ, సరస్వతి, మాతా, సూర్య పాఠశాలల్లో ఉచిత విద్యనందిస్తార న్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ సచివాలయాలు, నెట్‌సెంటర్లలో దరఖాస్తు చేసుకో వాలన్నారు. 20 నుంచి 24 వరకూ విద్యార్థుల ప్రవేశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను ఈ నెల 29వ తేదీ విడుదల చేస్తారు. జూన్ 8వ తేదీ పాఠశాలలో చేరవచ్చు. సీట్లు మిగిలితే రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి 18న ప్రవేశాలు కల్పిస్తారు. హెచ్‌టిటిపిఎస్//బిఎస్‌ఇ. ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, భూమి హక్కు పత్రం, ఉపాధిహామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సుతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కంటి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

బిపి, షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా కంటి పరీక్షలను చేయించుకోవాలని రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ ఆదివారం పట్టణంలోని ఎస్బిఐ కాలనీ మధు కంటి ఆసుపత్రి లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత కంటి (రెటీనా) పరీక్షల శిబిరమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి కన్ను స్పెషలిస్ట్ అనంతపురంలోని శ్రీ చక్ర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు, డాక్టర్. ఎస్. ఈశ్వర్ హాజరవుతున్నట్లు వారు తెలిపారు. కావున ఈ కంటి, రెటీనా పరీక్షల ఉచిత శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ కంటి చూపును కాపాడుకోవాలని తెలిపారు.

ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని చిన్మయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక సువర్ణ భారతి జూనియర్ కళాశాల,పూలకుంటలో ఉన్న కళాశాలలో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పరీక్షను నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రశ్న పత్రాలను కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠరెడ్డి, సెక్రెటరీ అనీల్ కుమార్ విడుదల చేశారు. ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు వెంకట్ తెలిపారు. ప్రతిభా పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు చిన్మయి సేవా ట్రస్ట్ ద్వారా ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యనందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే శనివారం సైతం మిగిలిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 5న మహాధర్నా

జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని పలు సమస్యలు, పరిష్కార విధానాలు, తదితర అంశాలపై మండల కమిటీ చర్చించింది. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. ప్రధానంగా సోలార్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని, ఇళ్ల స్థలాలు ఉన్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీ పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాలో ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి వెంకటేష్, మాబు, రవి, కొండా వెంకటేష్, కిష్టప్ప, గోవింద, రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్



ఎమ్మెల్యే పౌర సన్మాన ఏర్పాట్ల పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే పౌర సన్మాన ఏర్పాట్లు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేసిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పౌర సన్మానం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పౌర సన్మానం ఏర్పాట్లను ప్రారంభించారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం సాయంత్రం పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీ, మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, భాస్కర్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఆల్ ఇండియా ఎన్.బి.కె.ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి సతీష్, సాగునీటి సంఘం అధ్యక్షులు వెంకటేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు అమర్ నాథ్, కిరికెర మాజీ సర్పంచి రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాబా జయంతి వేడుకలకు వాహనాల పార్కింగ్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా వచ్చే వాహనాల పార్కింగ్‌కు అధికారులు స్థల పరిశీలన చేశారు. పట్టణ డీఎస్పీ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ప్రహల్లాద, తహశీల్దార్ కళ్యాణ్ తదితరులు పట్టణంలో పలు ప్రదేశాల్లో స్థల పరిశీలన చేశారు. ఈ ఏడాది నవంబర్ 23న జరిగే సత్యసాయి శత జయంతి వేడుకలకు భక్తులు, పర్యాటకులు భారీగా రానున్న నేపథ్యంలో ఈ పరిశీలన చేపట్టారు. పట్టణ బయట ప్రాంతాలు, చెరుకూరి గ్రూప్ వారి భూములు, పెట్రోల్ బంక్ సమీపంలోని భూములు, ఎనుములపల్లి సమీపంలోని భూములు పరిశీలించారు. వాహనాలు పట్టణంలోకి రానివ్వకుండా బయట ప్రాంతాల్లోనే వాహన పార్కింగ్‌కు అనువైన స్థలాలు ఎంపిక చేపట్టినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సునీత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు సబ్సిడీతో పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, నాయకులు కోట్ల రంగేగౌడ్, పాండు, లక్ష్మీపతి, డీలర్లు నరసేగౌడ్, బాషా, నాగభూషణం, సత్తి, రామంజి పాల్గొన్నారు.

రేపు మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ

ప్రజాశక్తి-పెనుకొండ

అనంతపురం నగరంలోని మాసినేని గ్రాండ్ హోటల్‌లో ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలకు మాదిగ ఉద్యోగుల సమైక్య(ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఎంఈఎఫ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు పట్టణంలో సభ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మడకశిర, శింగనమల, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, బండారు శ్రావణి, బొగ్గుల దస్తగిరి, గిత్త జయసూర్యలను సన్మానిస్తామని తెలిపారు. ఆ సభకు ముఖ్య అతిథులుగా ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ చిలుమూరి శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు హాజరవుతారన్నారు. కావున నియోజక వర్గంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న మాదిగ ఉద్యోగులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పోతులయ్య, మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ట్రెజరర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మాదిగ ఎమ్మెల్యేల అభినందన సభ ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

బాధిత రైతుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలం పరిధిలోని లోని కె. పూలకుంట గ్రామంలో రైతు సుధాకర్ కు చెందిన పాడి ఆవు మృతి ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి శుక్రవారం బాధిత రైతును పరామర్శించారు. రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమలో పూలకుంట ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహ రెడ్డి. అక్బర్, నాయకులు గోవింద రెడ్డి ముళ్ల భాస్కర్ రెడ్డి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమానికి విరాళం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గరుడంపల్లి రోడ్డు సమీపంలో కాశీనాయన సేవా ఆశ్రమం నిర్వహణకు ధర్మవరంలోని సుందరయ్య నగర్ కి చెందిన 29వ వార్డ్ కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, భర్త కోటిరెడ్డి బాలి రెడ్డి, కోటిరెడ్డి చరణ్ సింహారెడ్డి కుటుంబం విరాళం అందజేసింది. ఈ సందర్భంగా రూ.28,500 లను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. కోటిరెడ్డి గంగిరెడ్డి, కోటిరెడ్డి శాంతమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళం ఇవ్వడం జరిగిందని దాతలు తెలిపారు. దాతలకు ఆశ్రమ అధ్యక్షులు శివారెడ్డి ఉపాధ్యక్షులు శంకర చౌడప్ప కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సి వెంకటశివారెడ్డి, కోటిరెడ్డి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహుడా అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి- నంబులపూలకుంట

అహుడా అనుమతి పొందిన తర్వాతనే ప్లాట్లు వేసి అమ్మకాలు చేపట్టాలని ఎంపిడివో అంజనప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన సర్వేనెంబర్ 275, 276, 277, 278, 561, 563, 564 లలో కొత్తగా వేసిన లేఅవుట్ నిర్వాహకులకు శుక్రవారం నోటీసులు ఇచ్చారు. అహుడా అనుమతి తీసుకున్న తర్వాతనే ప్లాట్లు వేసి అమ్మకాలు నిర్వహించాలన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎస్‌కెయు యూజీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను పరీక్ష విభాగపు సంచాలకులు ఆచార్య జి వి రమణ శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాల,స్పేస్ డిగ్రీ కళాశాల ఎస్వీ డిగ్రీ కళాశాల, అమృతవల్లి డిగ్రీ కళాశాలలోని పరీక్షాకేంద్రాలను పరిశీలించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారు స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ అందించే రుణాలకు దరఖాస్తు చేసుకోవాలనికమిషనర్ ప్రహల్లాద తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ు దారిద్ర రేఖకు దిగువనున్న నిరుద్యోగ యువతీ యువకులు 21 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. రుణాల కోసం లబ్ధిదారులు సచివాలయాల్లో కానీ ఇంటర్నెట్ లో కానీ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగం అధికారులను సంప్రదించాలని కమిషనర్ చెప్పారు.

నేడు మండల మీట్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సరస్వతి తెలిపారు. మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే సమావేశానికి జడ్పిటిసి, ఎంపీపీ తో పాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. అదే విధంగా మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వానికి సమాంతరంగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు నిలిపివేయడం సరైంది కాదని అఖిలపక్షం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం, సిపిఐ జనసేన, సిపిఐ ఎంఎల్ , ఎమ్మార్పీఎస్, బిఎస్పీ డిహెచ్‌పిఎస్‌తో పాటు ఆయా రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ అందిస్తున్న సేవలు ఆర్డిటి ఏ మతానికో సంబంధించింది కాదన్నారు. అన్ని సంస్థలతో సమానంగా ఆర్డీటీని చూడడం సరైనది కాదని తెలిపారు. ఆ సంస్థ అందించే సేవలు ఒకసారి పరిశీలించాలన్నారు. కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంత జిల్లాకి ఆర్డీటీ ఒక వరప్రదాయిని అని చెప్పారు. ఇలాంటి ఆర్డీటీనికాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీని కోసం రాజకీయాలకు అతీతంగా ప్రయత్నం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌టియు సుధాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, జనసేన పట్టణ అధ్యక్షులు శ్యామ్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కేసగాళ్ల వెంకటేష్, సిఐటియు జిల్లా నాయకులు జేవి రమణ, అయూబ్ ఖాన్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, బీఎస్పీ వినయ్, సిపిఐ పూలశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతులు నిరాకరించడం అన్యాయం

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఏను రద్దు చేయడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున అన్నారు. శుక్రవారం ధర్మవరంలో ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రెన్యువల్స్‌ను ఆపివేయడం అన్యాయమన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పేదలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఆర్‌డిటి సేవలను కొనసాగించేందుకు ఐక్యఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షులు అమన్, ఉపాధ్యక్షులు హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో పేదవిద్యార్థులకు 25శాతం సీట్లు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని పేద విద్యార్థులకు దాదాపు 45 ప్రయివేటు పాఠశాలలో ఒకటవ తరగతికి ప్రవేశం కల్పించడం జరుగుతుందని అన్నారు. మే నెల రెండవ తేదీ నుండి మే నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. దరఖాస్తులను ఆయా సచివాలయాలలో గాని వెబ్‌సైట్‌లో గాని చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లాటరీ విధానములో తొలి విడత జాబితాను మే 29వ తేదీ విడుదల చేస్తారని, సీట్లు సాధించిన విద్యార్థులను జూన్ 8వ తేదీన ఖరారు చేస్తారని తెలిపారు. అదే విధంగా రెండో విడత జాబితాను జూన్ 11వ తేదీన విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థులను జూన్ 18వ తేదీ ఖరారు చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1800425899కు సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు కదిరప్ప డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలన్నారు. కూలీల భద్రత కోసమే వచ్చిన ఈ పథకంలోని నిధులన్ని వారికే కేటాయించాలన్నారు. కూలీల సంఖ్య ప్రకారం నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టాలని కోరారు. కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి వయోజనుడికి విడిగా జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. పని అడిగిన వారికి 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు.ఉపాధి హామీలో యంత్రాలను, కాంట్రాక్టర్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి నాయుడు, రామచంద్ర, రమణ,ఉపాధి కూలీలు లక్ష్మీపతి, కృష్ణయ్య ,లక్ష్మీనారాయణ ,ఉమాపతి, గౌరమ్మ, లక్ష్మీనరసమ్మ, రత్నమ్మ ,రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న సిపిఎం నాయకులు

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని వీరాపురం పంచాయతీకి చెందిన హుస్సేన్‌పురం గ్రామ రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్‌కు అందజేశారు. షాపులో తక్కువ తూకాలు, అధిక ధరల దందా కొనసాగుతోందని వారు విమర్శించారు. రేషన్ డీలర్ ప్రతి నెల రేషన్ సరఫరా సమయంలో గోనె సంచులను బరువులో కలిపి బియ్యం తూకం వేస్తున్నాడని, ఒక్కొక్క లబ్దిదారునికి కనీసం 1 కిలో వరకూ తక్కువ వస్తుందని అన్నారు. ఇటీవలి దాదిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన లబ్దిదారులు తక్కువ తూకాల మోసాన్ని వీడియో రూపంలో బట్టబయలు చేయగా, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిందనాఏనరు. రేషన్ షాపులో బ్యాళ్లు, చక్కర వంటి వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్నారు. చిన్నపిల్లలతో బియ్యాన్ని తూకం వేయిస్తున్నాడన్నారు. సంబంధిత అధికారులు రేషన్ డీలర్‌పై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రామచంద్ర, సుధాకర్, నరసింహ, అశ్వర్థ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చని సత్యసాయి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన బాల బాలికలు 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలల్లో చేరడానికి ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాల్లో బ్లాక్ లాక్ 3వ తరగతికి 360 సీట్లు, 4వ తరగతికి 280 సీట్లు, 5వ తరగతికి 259 సీట్లు, 6వ తరగతికి 142 సీట్లు, 7వ తరగతికి 75 సీట్లు, 8వ తరగతికి 47 సీట్లు, 9వ తరగతికి 61 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రతి పాఠశాలలోనూ 3వ తరగతి ప్రవేశం కొరకు ఎస్టి 32, ఎస్సి 5, బిసి ఒకటి సీటు రిజర్వేషన్ విధానం ద్వారా నింపబడుతుందన్నారు. ఎక్కువ దరఖాస్తులు వస్తే విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల అధికారుల సమక్షంలో ఈనెల 30 లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామీణ తపాలా డక్ సేవక్ పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ మాజీ ఆల్ ఇండియా అధ్యక్షులు బివి రావు తెలిపారు. ఈ మేరకు అయన శుక్రవారం పుట్టపర్తి లోని జయ సాయి హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి వివి. రామకష్ణ, మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి భూలోకం రమేష్ బాబు , హిందూపురం డివిజన్ ఏ ఐ డి యస్ యూనియన్ నాయకులు అల్లాబాకష్ ,కేశవులు నాయక్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1న పోస్టల్ బోర్డు కార్యదర్శి , డైరెక్టర్ జనరల్ తో కొత్త ఢిల్లీ డాక్ భవన్ లో పోస్టల్ ఉద్యోగుల సమస్యల గురించి చర్చించామన్నారు. ఈ సమావేశంలో 23 పోస్టాఫీసులు మూసివేయుట గురించి మరోసారి పరిశీలించనున్నామని చెప్పారన్నారు. ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ల(ఐ డి సి)లలో పనిచేసే జీ డీ యస్‌లకు 7 నుండి 8 గంటల డ్యూటీ ఇవ్వాలని నాయకులు గట్టిగా కోరినప్పటికీ డిపార్ట్మెంట్ వారు అంగీకరించలేదని, జీడిఎస్‌లు 5 గంటల కంటే ఎక్కువ పని చేయనవసరం లేదని తెలియజేశారన్నారు. గ్రాట్యూటీ, లీవ్ ఎక్యుములేషన్ ,గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమోషన్లు, సబ్ స్టిట్యూట్లకు వేతనాల చెల్లింపు , ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సర్కిల్స్ లోని సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. పై విషయాలపై పోస్టల్ ఉన్నత అధికారులు సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సిహెచ్ఒల సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామనిజిల్లా ఏపీ ఎంసిఏ ప్యానల్ అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ లోని నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న సిహెచ్ఒలు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె శుక్రవారానికి ఐదోరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మెకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, పలు ఉద్యోగ సంఘాల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. రెండు సంవత్సరాల నుండి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, దీనికి సమబంధించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు లింగా రామ్మోహన్, ఉపాధ్యాయ సంఘం ఏపీఎస్ఆర్టీసీ సంఘం నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సంఘం నాయకులు సమ్మెకు తమ మద్దతు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిహెచ్ఒలు

కుటాళ్ల లక్ష్మణ్‌కు యంగ్ ఇండియన్ బ్లడ్ సేవా పురస్కారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి కి చెందిన కుటాళ్ల లక్ష్మణ్ చేసిన సామాజిక సేవలకు యంగ్ ఇండియన్ బ్లడ్ సేవా పురస్కారం లభించింది.ఈ మేరకు హైదరాబాద్ నెహ్రూ ఆడిటోరియంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్ క్లబ్ తరుపున యంగ్ ఇండియన్ బ్లడ్ సేవా పురస్కారాన్ని లక్ష్మణ్‌కు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి బ్లడ్ క్యాంప్స్ నిర్వహిస్తున్న లక్ష్మణ్ చేసిన సేవలకు ఈ పురస్కారాన్ని అందజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కూటాళ్ల లక్ష్మణ్

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని నిడిగల్లు పెద్దకోట్ల గ్రామాలలో శుక్రవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుక్త వయసు గల కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం పరిశుభ్రత, బాల్య వివాహాలపై అవగాహన తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం లలితమ్మ, ఏ చంద్రమ్మ, ఎఎన్ఎం రేష్మ, ఆశ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తలుపుల : బాలికల భవిష్యత్తుకు కిషోర్ వికాసం కార్యక్రమాలు దోహదపడతాయని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రతి అంగన్వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాలను శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు దీప, అలివేలమ్మ, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలోని వీరపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని చేపట్టారు. 14-18 ఏళ్ల కిశోర బాలికల కోసం నిర్వహించిన ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్య, నైపుణ్యం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి 12 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెస్కే చాందిని, ఎఎన్ఎం మంజుల, ఎన్జీవో మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం రామస్వామి దేవాలయం అంగన్వాడి కేంద్రంలోకిషోరి వికాసం కార్యక్రమం కదిరి ప్రాజెక్టు సిడిపిఒ రాధిక శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు కిషోరి వికాస్ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :హిందూపురం పట్టణంలోని 31వ వార్డు పాత హస్నాబాద్ సచివాలయంలోకిశోర బాలికల వికాసం పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సూపర్ వైజర్ అనిత నేతత్వంలో వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి ఈ సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగనవాడి కార్యకర్తలు, ఎఎన్ఎంలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలోని ఎస్ఆర్.హట్టి గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎఎస్ఐ రమణ తెలిపిన వివరాలు.. ఎస్ఆర్.హట్టి గ్రామానికి చెందిన మహేష్, రోజా(28) దంపతులు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం. మహేష్ గొర్రెలను మేపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజా పిల్లలు పుట్టిన తర్వాత ఆపరేషన్ చేయించుకుంది. ఆ తర్వాత కొన్నేళ్ల నుంచి ఆమె తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రోజా శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఇంట్లో ఐరన్ పైపునకు తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన వెంటనే ఎఎస్ఐ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోజా తల్లి పుట్ట రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధర్మవరంలో యువతి అదృశ్యం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ఒకటో వార్డు గూడ్స్ షెడ్ కొట్టాలలోని బంధువుల ఇంటికి వచ్చిన యువతి గురువారం అదృశ్యమైంది. హిందూపురం మండలం చలివెందుల గ్రామానికి చెందిన యువతి అనంతపురం పట్టణంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం ధర్మవరం ఒకటో వార్డు గూడ్స్ షెడ్ కొట్టాలలో నివాసం ఉంటున్న ఆమె పెద్దమ్మ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో యువతి గురువారం సాయంత్రం ఐదు గంటలకు ఇంటిలో నుండి బయటకు పోయి తిరిగి రాలేదు. దీంతో యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ధర్మవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

కొడికొండ చెక్‌పోస్టు పెట్రోల్ బంక్ మలుపు వద్ద శుక్రవారం ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో లేపాక్షి మండలం మామిడాకులపల్లి చెందిన లీలావతి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. లీలావతి ఆమె భర్త గోరంట్ల నుండి లేపాక్షికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆమెకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యుత్‌షాక్ విద్యార్థి మృతి చెందాడు. వేసవి సెలవులు కావడంతో తోటి మిత్రులతో కలిసి ముదిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య (11) క్రికెట్ ఆడుకుంటున్నాడు. బాల్ పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పైకి వెళ్లి పడింది. బాల్‌ని తీసుకోవడానికి అశ్విన్ ఆరాధ్య భవనం పైకి వెళ్ళాడు. నిన్న రాత్రి పడిన చినుకులకు మిద్దె తడిగా ఉండడంతో పాటు మిద్దె పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. సమీపవాసులు గమనించి వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాఠశాల పైభాగాన ఎల్‌టి లైన్ వైర్ల గురించి ఇటు ఉపాధ్యాయులు, అటు శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిండు ప్రాణం బలైందని ఆ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని లింగప్ప గారి పల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని అతని తల్లి జయమ్మ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వికలాంగుడైన భాస్కర్ రెండు నెలల నుంచి కనిపించలేదన్నారు. అప్పటినుంచి బంధువులు, తెలిసిన వారి వద్దకు వెళ్లి విచారించినప్పటికీ ఆచూకీ లభ్యంకాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణం ఇందిరమ్మ కాలనీ కి చెందిన సాకే ఆంజనేయులు(37) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయులు గుజిరి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్య కారణాలతో ఇందిరమ్మ కాలనీ రైలు పట్టాలకు దగ్గరలో ఉన్న వేపచెట్టుకు టవల్‌తో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సి ఐ రెడ్డప్ప తెలిపారు.

రోడ్డు ప్రమాదం .. ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెర్లోపల్లికి చెందిన ప్రభాకర్, లక్ష్మీపతి ద్విచక్రవాహనంలో పుట్టపర్తి నుంచి గ్రామానికి తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఒకరైన లక్ష్మీపతి ఆర్మీలో పని చేస్తున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక 'పది' ఫలితాల్లో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి-పావగడ

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చిలో జరిగిన ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల ఫలితాలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలయ్యాయి. పట్టణంలోని శారదా విద్యా పీఠంకు చెందిన జకియా తస్కిన్ 620/625 మార్కులతో తాలూకా టాపర్‌గా నిలిచింది. అలాగే సహనా పాఠశాలకు చెందిన గీతాలక్ష్మి-619, శారద విద్యాపీఠంకు చెందిన యతీష్-617 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు విద్యాశాఖ అధికారి ఇంద్రాణమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. తాలూకాలో మొత్తం 25 మంది విద్యార్థులు 600 నుంచి 620 లోపు మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 50.39 శాతం, ఎయిడెడ్ పాఠశాలల్లో 37.07శాతం, ప్రయివేట్ పాఠశాలల్లో 70.40శాతం, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 85.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. తాలూకా మొత్తంలో 54.37 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు తాలూకా విద్యాశాఖ అధికారి తెలిపారు. కొడిగెహళ్లి ప్రభుత్వ మొరార్జీ రెసిడెన్షియల్ స్కూల్(బీసీ) విద్యార్థులు చరిత్ర సష్టించారు. ప్రిన్సిపల్ తిప్పేస్వామి మాట్లాడుతూ ఆదిలక్ష్మి-616, ధ్రువ్-614, పల్లవి-614, జోష్న-611, మైత్రి-610, రాజేష్-608, ప్రగతి-606, మధుమోహన్- 606, యోగేష్-600 మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులను ప్రిన్సిపల్ అభినందించారు.

మోడల్ స్కూల్లో 6వ తరగతికి ప్రవేశాలు

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

పట్టణ పరిధిలోని గుట్టకిందపల్లి లో గల ఆదర్శ ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతికి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు హెడ్మాస్టర్ పద్మశ్రీ తెలిపారు. 2025 -26 సంవత్సరపు ఆరవ తరగతి ప్రవేశం కొరకు ఏప్రిల్ 21వ తేదీన పరీక్షలు నిర్వహించారు.. ఈ పరీక్షలకు సంబందించిన ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో మొత్తం 265 మంది విద్యార్థులు హాజరుకాగా 136 మంది ఎంపికయ్యారన్నారు. ఇందులో టీ. జాహ్నవి 89, జి. కారుణ్య 80, వాణిశ్రీ 80 మార్కులు సాధించారన్నారు. 6వ తరగతి ప్రవేశానికి ఎంపిక కాబడిన వారికి సమాచారం అందించామని చెప్పారు.